రండి..వ్యాయామం చేద్దాం

పెందుర్తి: పార్కుల్లో పిల్లలకు ఆటవిడుపుతో కూడిన ఆహ్లాదం. పెద్దలు సాయంత్రం పూట కాలక్షేపానికి మాత్రమే పరిమితం కాకుండా జీవీఎంసీ జనవాసాల్లో పార్కులను అత్యాధునికంగా తీర్చిదిద్దింది. ఈ క్రమంలో ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించింది. గత ప్రభుత్వం జీవీఎంసీ ద్వారా పార్కుల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేసింది. దీంతో ప్రజలు తమ అనుకూలమైన సమయంలో వ్యాయామాలు చేసుకుని ఆరోగ్యంపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. ఈ క్రమంలో పార్కు/ప్రత్యేక స్థలంలో ఓపెన్ జిమ్‌లో కనీసం రూ.5 లక్షల నిధులతో జిమ్ పరికరాలు అమర్చారు. ఆయా జిమ్‌లలో ఏ పరికరాన్ని, ఎలా వినియోగించాలి..ఎన్ని క్యాలరీలు ఖర్చు అవుతాయన్న వివరాలతో డిజిటల్ క్యూ ఆర్ బోర్డు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆయా పార్కులు వ్యాయామ శాలలుగా మారి ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తున్నాయి.


సుజాతనగర్ సీ-1 జోన్‌లో ఓపెన్ జిమ్ , పరికాల వినియోగంపై అవగాహన కల్పించే బోర్డు


సుజాతనగర్ బి-జోన్ పార్కులో జిమ్ పరికరాలు


ఓపెన్ జిమ్ ఉన్న విశాలమైన సత్యానగర్ పార్కు


సత్యానగర్‌లో ఏర్పాటు చేసిన జిమ్ పరికరాలు

క్లుప్తంగా

గ్రాండ్ మాస్టర్లకు సత్కారం


గ్రాండ్ మాస్టర్లను సత్కరిస్తున్న నిర్వాహకులు

పరవాడ: ఆంధ్రప్రదేశ్ థాంగ్-టా ఆధ్వర్యంలో స్టేట్ లెవెల్ థాంగ్-టా గేమ్ రూల్స్‌పై ఈ నెల 27, 28 తేదీల్లో అగనంపూడిలో క్యాంపు నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన క్యాంపులో గ్రాండ్ మాస్టర్ వయాంద్రం ప్రేమ్ కుమార్ (మణిపూర్) గేమ్ రూల్స్‌ను, తాంగట అఫీషియల్ రూల్స్, రెగ్యులేషన్స్ పై మాస్టర్లు విద్యార్థులకు వివరించారు. గేమ్స్ నేర్చుకోవడానికి ఐదు జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. గ్రాండ్ మాస్టర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కరాటే గ్రాండ్ మాస్టర్ ఎస్.నూకరాజు, థాంగ్-టా విశాఖ జిల్లా చైర్మన్ ఎం.యువరాజు, టెక్నికల్ డైరెక్టర్ గొర్లి పుష్పారావు, ప్రతినిధులు శ్రీనివాసరావు, రాయుడు, సత్యదేవి ఫణీంద్రకుమారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేసి 108 స్వర్ణసంపెంగ దళాలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

శివాలయం నిర్మాణానికి విరాళాల అందజేత


ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాతలు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని శివాలయం పునర్నిర్మాణానికి పలువురు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. సబ్బవరానికి చెందిన యడ్ల నాయుడు మాస్టారు రూ.50,116, అలాగే గెడ్డంపేటకి చెందిన సబ్బవరపు ఈశ్వరరావు రూ.20,116 ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నానిబాబు,బర్ల రమణ,కోరాడ శ్రీను, చింతల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక జీవితం..అదృష్టం


ఉక్కు ఉద్యోగి సాంబశివరావును సత్కరిస్తున్న కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ

అగనంపూడి: ఆధ్యాత్మిక చింతనలో తరించే అదృష్టం కొద్దిమందికే దక్కుతుందని విశాఖ స్టీల్‌ప్లాంట్ డబ్ల్యూఆర్ఎం విభాగాధిపతి ఎస్. శ్రీనివాసశర్మ అన్నారు. 87వ వార్డు లక్ష్మీపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష సేవలు అందిస్తున్న ఉక్కు ఉద్యోగి సాంబశివరావును ఆలయ కమిటీ, వికాస్ తరంగిణి అన్నదాన కమిటీ ఘనంగా సత్కరించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అందుతున్న సేవల్లో విరివిగా పాల్గొంటున్న వ్యక్తి సాంబశివరావు అని కొనియాడారు. ఆలయ కమిటీ చైర్మన్ బి.అశోక్‌రాజు, కార్యదర్శి ఎస్ఆర్‌సీ వర్మ, ప్రతినిధులు సుబ్బరాజు, వీర్రాజు, వరహాలబాబు, కృష్ణంరాజు, శ్రీరామూర్తి, చంద్రశేఖర్, నరసింహ గోపాల్, అన్నదాన, వికాస్ తరంగణి మిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సండే సందడి


తిక్కవానిపాలెం తీరంలో జలకాలాడుతున్న పర్యాటకులు

పరవాడ: మండలంలోని తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం తీర ప్రాంతాలు ఆదివారం పర్యాటకులతో సందడిగా మారాయి. వర్షాలు తగ్గుముఖం పట్టడడంతో సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు తీర ప్రాంతాలకు తరలివచ్చారు. ఇసుక తిన్నెలపై ఆటపాటలతో సందడి చేశారు. యువత ఫొటోలు తీసుకోవడంలో బిజీగా కనిపించారు. సాయంత్రం తీరంలో జలకాలాటలతో ఎంజాయ్ చేశారు.

‘శ్రీమద్రామాయణం’ వ్యాస సంపుటి ఆవిష్కరణ


గరికిపాటి నరసింహారావుకు పుస్తకాన్ని అందిస్తున్న ఆవిష్కర్త అప్పాజోస్యుల సత్యనారాయణ

సీతంపేట: వాల్మీకి రామాయణంలో రాముడు సాధారణ మానవుడని, విశ్వనాథ వారి రామాలయలో రాముడు సాక్షాత్తు పరమేశ్వర స్వరూపుడని(విష్ణువు) ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ అన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సభలో ‘శ్రీమద్రామాయణ కల్పవృక్షము, ఉదాత్త కల్పనలు’ వ్యాస సంపుటిని ముఖ్య అతిథిగా ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం సంపాదకులుగా, బాలకాండపై వ్యాసం రాయగా, ఐదుగురు గొప్ప సాహితీవేత్తలు అద్దంకి శ్రీనివాస్, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, బులుసు వెంకటేశ్వర్లు, కడిమిళ్ల వరప్రసాద్, పేరి రవికుమార్ ఐదు కాండాలకు వ్యాసాలు రాయడం, అటువంటి గొప్ప వ్యాస సంపుటి ఆవిష్కరణకు అవకాశం కల్పించడం అంతా రాముని దయగా పేర్కొన్నారు. ఉదాత్త కల్పనల వల్లే రామాయణానికి గొప్ప మహత్తు వచ్చిందన్నారు. విశ్వనాథ వారి రచన ఊహకందదని, పాత్ర ప్రవేశం చాలా గొప్పగా వర్ణిస్తారన్నారు. తొలి ప్రతిని విశ్వనాథ మనువడు విశ్వనాథ సత్యనారాయణకు అందజేశారు. సభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన గరికిపాటి నరసింహారావుకు మరో ప్రతిని అందించారు. సభాధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ రామాయణంపై విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో వరుసగా మూడు కార్యక్రమాలు నిర్వహించే అవకాశం రాముని వల్లే లభించిందన్నారు. వినూత్న రీతిలో వ్యాసకర్తలే సమీక్షించడం విశేషమని పేర్కొన్నారు. విశ్వనాథ సత్యనారాయణ మాట్లాడుతూ తాత గారు రాసిన మూల గ్రంథాలన్నీ అచ్చువేసి అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. విశ్వనాథ తండ్రి శోభనాద్రి ఆజ్ఞతో తాతగారు రామాయణం రాశారని తెలిపారు. చివరగా గరికిపాటి నరసింహారావు ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రయాగ సుబ్రహ్మణ్యం, తురగా కృష్ణకుమార్, పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి


ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ విజయకుమార్


ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ శ్రీను

సీతమ్మధార: ఎటువంటి నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు పోలీసులు సూచించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ ఎస్.విజయకుమార్ కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు. సమాజంలో ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే పనులపై పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకుని మంచిగా నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ హితవు పలికారు. కార్యక్రమంలో ప్రమీల, వెంకటరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

– ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని హెచ్చరించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబాలతో కలిసి ఆనందంగా జీవించాలని సూచించారు. రౌడీషీటర్లపై దినచర్యపై ఆరా తీశారు.

ఐకమత్యంగా కళింగ సంఘం విస్తరణ


సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న నాయకులు

మధురవాడ : కళింగ సామిజిక వర్గం సంక్షేమ భవనానికి ప్రభుత్వం విశాఖపట్నంలో 1000 గజాల స్థలం కేటాయించి, భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర కళింగ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు పీసాన వెంకటరమణ డిమాండ్ చేశారు. జీవీఎంసీ 5వ వార్డు మధురవాడ చిలుకూరి గార్డెన్ సమీపంలో రాష్ట్ర కమిటీ సమావేశం రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ పీసా రామచంద్రరావు, రిటైర్డ్ విశాఖ ఫారెస్ట్ ఆఫీసర్ బి.రామనరేష్, రిటైర్డ్ వుడా చీఫ్ ఇంజినర్ ఎం.అప్పన్న ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఐకమత్యంతో రాష్ట్ర కమిటీని, సంఘాన్ని విస్తరించాలని కోరారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పేదవారికి అండగా నిలవాలని నిర్ణయించారు. తమ సామాజిక వర్గానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. అనంతరం రాష్ట్ర నాయకులు కమిటీ సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో దుప్పల లక్ష్మణమూర్తి, బొడ్డేపల్లి రామారావు, నానుపాత్రుని సత్యనారాయణ, బెండి చిరంజీవి, ఎం.రామారావు, మధురవాడ కళింగ అసోసియేషన్ అధ్యక్షుడు బగాది లక్ష్మణ, బుడుమూరి చంద్రశేఖరరావు, మొజ్జాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాలిక బలవన్మరణం

యల్లపువానిపాలెంలో ఘటన

గోపాలపట్నం : యల్లపువానిపాలెంలో బాలిక ఉరి వేసుకుని మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదం నింపింది. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పడక గదిలో హుక్కుకు ఉరి వేసుకుని మృతి చెందింది. బాలిక యల్లపువానిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి చదువుతోంది. తల్లి వరలక్ష్మి ఎన్ఏడీలోని ఒక హోటల్లో పని చేస్తోంది. మధ్యాహ్నం వరకు అక్క, బావ ఇంట్లో ఉన్నారు. వారు బయటికి వెళ్లిన తర్వాత బాలిక ఉరి వేసుకుంది. వీరు మూడు గంటల సమయంలో ఇంటికి వచ్చే సరికి బెడ్ రూములో ఉరి వేసుకుని ఉండడం గమనించారు. దాంతో తలుపులు పగులగొట్టి బాలికను దించారు. అప్పటికే బాలిక మరణించినట్లు కుటుంబ సభ్యులు నిర్ధారించారు. బాలికకు కడుపునొప్పి ఉందని, దీని వల్లే మృతి చెంది ఉంటుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

తాటిచెట్లపాలెం: రైలులో అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించినట్లు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలిలా.. ఈ నెల 13న లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం చేరుకున్న అనంతరం రైలును నిర్వహణ పనుల నిమిత్తం న్యూ కోచింగ్ కాంప్లెక్స్‌కు తరలించారు. రైలు నిర్వహణ పనులు చేపడుతున్న సమయంలో జనరల్ కోచ్‌లో సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని క్లీనింగ్ సిబ్బంది, రైల్వే భద్రతా దళ సిబ్బంది గుర్తించి, వెంటనే చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఈ వృద్ధురాలు శనివారం రాత్రి మృతిచెందింది. ఈ మహిళకు సంబంధించి ఏ విధమైన ఆధారాలు లభ్యం కాలేదని, ఈమె సుమారు 5 అడుగుల ఎత్తు, పసుపు, నలుపు రంగులు గల నైటీ ధరించి ఉందని జీఆర్పీ సిబ్బంది తెలపారు. ఈమె గురించి తెలిస్తే రైల్వే పోలీసులకు గానీ, 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ ఎస్ఐ వి.బాలాజీరావు కోరారు.

ముగ్గురు యువకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్

కొమ్మాది : ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతుండగా లైఫ్‌గార్డ్స్ ముగ్గురు యువకుల ప్రాణాలు కాపాడారు. నగరంలోని ఓ కళాశాలలో చదువుతున్న వి.ఈశ్వరరావు, రామ్మోహన్, భరత్ ఆదివారం సరదాగా గడిపేందుకు ఇక్కడి బీచ్‌కు చేరుకున్నారు. స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. అలల ఉధృతి ఎక్కువగా ఉండటం వల్ల ముగ్గురు యువకులు కొట్టుకుని పోతుండగా విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ గమనించి తీరానికి తీసుకొచ్చారు. అయితే ఈశ్వరరావు పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స పొందుతున్నట్లు మెరైన్ పోలీసులు తెలిపారు.

అలరించిన స్టోరీ టెల్లింగ్


పిల్లలకు కథ చెబుతున్న సీతా శ్రీనివాస్

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన మియావాకీ స్టోరీ టెల్లింగ్ పిల్లలను అలరించింది. కథకురాలు సీతా శ్రీనివాస్ తనదైన శైలిలో కథలు చెప్పి యువ మనసుల్లో ఊహ, సృజనాత్మకత వెలిగించారు. జూ డక్, ట్రైన్ అండ్ ది ఫార్ అవే మౌంటైన్ కథలను చెప్పే విధానం ఆసక్తికరంగా సాగింది. పిల్లలు కథలు వినడంతోపాటు కథలకు సంబంధించిన ఆటపాటల్లో నిమగ్నమయ్యారు. ముద్రించిన సాహిత్యాన్ని, వారి కలలను చిన్న చిన్న వర్క్ షీట్లపై పొందుపర్చారు. యాక్టివిటీలో భాగంగా పాటలు పాడటం, హ్యాండ్ ఆన్ యాక్టివిటీలు, బెలూన్ బ్లోయింగ్‌లో పిల్లలు చురుగ్గా పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 60 మంది చిన్నారులు పాల్గొన్నారు.

అమ్మో.. వెన్నలపాలెం రోడ్డు!


అధ్వానంగా వెన్నలపాలెం రోడ్డు

పరవాడ: తంతడి- వెన్నలపాలెం రోడ్డు గుంతలమయంగా తయారైంది. దీంతో ఆ రోడ్డులో ప్రయాణమంటే భయపడుతున్నారు. గతంలో ఈ రోడ్డు పెద్దగా ఉపయోగంలో ఉండేది కాదు. పరిశ్రమల రాకతో ఈ రోడ్డును అనేక గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ పరిశ్రమలకు రాకపోకలు సాగించే ఉద్యోగులు, కార్మికులు, వివిధ గ్రామాల ప్రజల రాకపోకలతో రహదారి నిత్యం బిజీగా ఉంటుంది. అయితే రోడ్డు నిర్వహణను పట్టించుకోకపోవడంతో గుంతల మయంగా మారింది. రాత్రి సమయంలో పరిశ్రమల్లో విధులు ముగించుకొని ఇళ్లకు చేరే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు కూడా తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని వాహనచోదకులు వాపోతున్నారు. ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రహదారి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అదుపు తప్పితే అంతే!


మరిశవానిపాలెం చెరువు వద్ద విరిగిపోయిన కల్వర్టు రక్షణ గోడ

పరవాడ: కలపాక-పి.బోనంగి రహదారిలో మరిశవానిపాలెం చెరువు వద్ద రోడ్డు కల్వర్టు రక్షణ గోడ విరిగిపోయింది. ఈ పరిస్థితి చాలా రోజులుగా ఉన్నా ఆర్ అండ్‌బీ అధికారులు కనీస చర్యలు చేపట్టడడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరిశవానిపాలెం చెరువు నుంచి పొలాలకు నీరందించడానికి ఏర్పాటు చేసిన కల్వర్టు భారీ వర్షాల కారణంగా దెబ్బతింది. కల్వర్టు కూలిపోవడంతో ఆ ప్రదేశంలో పెద్ద గుంత ఏర్పడి ప్రయాణికులను ఆందోళనకు గురి చేస్తోంది. ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాపరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు ఈ రహదారిలో రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు పక్కన ఏర్పడిన గొయ్యి కారణంగా చీకటి పడితే రహదారిలో రావడానికి జంకుతున్నారు. చీకటి పడితే రహదారిలో అంధకారం అలముకుంటుంది. ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి రోడ్డు పక్కన ఏర్పడిన భారీ గుంతను పూడ్చడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన


నృత్యప్రదర్శన చేసిన విద్యార్థులతో సత్యదేవ్ తదితరులు

సింహాచలం: భారతీయ సాంప్రదాయంలో మానవతా విలువలు, వేద విజ్ఞానం, సాహిత్యనృత్య, సంగీత కళల పరిరక్షణ ప్రధానమని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ అన్నారు. సింహగిరిపై రాజగోపురం పక్కన ఉన్న కళావేదికపై విజయవాడకు చెందిన మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన 150 మంది నృత్య కళాకారులతో ఆదివారం ప్రత్యేక నృత్యప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సత్యదేవ్ మాట్లాడుతూ దైవానుగ్రహం, పురుష ప్రయత్నం మానవజీవితంలో ముఖ్యమైనవని తెలిపారు. దైవారాధన, పరహిత జీవన విధానం సమాజ హితానికి దోహదపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా ప్రత్యేక నృత్యప్రదర్శన ఏర్పాటు చేసిన కల్చరల్ ఆర్ట్స్ నిర్వాహకులు నందిరాజు కృష్ణను అభినందించారు. తిరుపతి, చిత్తూరు, రాజమండ్రి, ఉత్తరాంధ్ర తదితర ప్రాంతాలకు చెందిన 150 మంది నృత్యప్రదర్శనతో అలరించారు. ప్రదర్శనలో పాల్గొన్న వారి సత్యదేవ్ సర్టిఫికెట్లు, జ్ఞాపికలు, వరాహ లక్ష్మీనృసింహస్వామి చిత్రపటాలు అందజేశారు.

టోల్‌గేటును శాశ్వతంగా ఎత్తివేయాలి


అగనంపూడి టోల్‌ప్లాజా వద్ద ఆందోళన చేపడుతున్న సీపీఎం నాయకులు

అగనంపూడి: అగనంపూడి టోల్‌గేటును శాశ్వతంగా ఎత్తివేయాలని, ఇప్పటికే పిలిచిన టెండర్లను రద్దు చేయాలని 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారామ్ డిమాండ్ చేశారు. సీపీఎం స్టీల్‌సిటీ జోన్ కమిటీ ఆధ్వర్యంలో అగనంపూడి టోల్‌ప్లాజా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలపరిమితితో పిలిచిన టెండర్లను వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. తెలుగుదేశం, కూటమి నాయకులు నెలరోజుల క్రితం టోల్‌గేటును ధ్వంసం చేసి ఎత్తివేశారని ప్రచారం చేసుకుంటున్నారని, అయితే వాస్తవంగా పద్ధతి ప్రకారం టెండర్లను నిలుపుదల చేసేలా కూటమి నాయకులు ప్రయత్నం చేయాలని కోరారు. తొలగించిన కొద్దిరోజులకే భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రాంతాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్‌హెచ్ఏఐ అధికారులకు అగనంపూడి టోల్‌గేటును కొనసాగించాలని ఆదేశించినట్టు తెలిసిందని, అదే వాస్తవమైతే టీడీపీ ద్వంద్వనీతి బయటపడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో స్టీల్‌జోన్ కమిటీ నాయకులు పెదిరెడ్ల నీలకంఠం, ఉరివిటి మరిడయ్య, శ్రీనివాసరాజు తదితరులు మాట్లాడారు.

ఉక్కు దీక్షకు సంఘీభావం


దీక్షలో పాల్గొన్న సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షకు ఆదివారం డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకుడు బానోజీ బిల్లా మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాల ఫలితంగా స్టీల్‌ప్లాంట్ వచ్చిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మడాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ దగ్గరికి వస్తే తరిమికొడతామని, ప్లాంట్‌కు ఎవరు వచ్చినా అడ్డుకుంటామని అన్నారు. ఉక్కు పరిశ్రమను లాభాల బాటలోకి తీసుకురావడానికి కార్మికులు కష్టపడి పని చేస్తుంటే ప్రభుత్వం, యాజమాన్యం కలిసి బొగ్గు కొరత సృష్టించారన్నారు. ఉత్పత్తికి ఆటంకం కలిగించడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆపరేటివ్ డైరెక్టర్ మీసాల సురేష్, షాప్ కమిటీ మెంబర్ వినీష్, సూరప్పుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక నిల్వపై అధికారుల కొరడా

అగనంపూడి: అక్రమంగా ఇసుక నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యక్తిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కొరడా ఝుళిపించారు. కేసు నమోదు చేసి ఇసుకను స్వాధీనం చేసుకొని రూ.25వేల జరీమానా విధించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో లక్ష్మణనాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని దువ్వాడ, మంగలపాలెం, వెదుళ్లనరవ పరిసర ప్రాంతాల్లో కొంతమంది వ్యక్తులు ఇసుకను అక్రమంగా నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు గాజువాక తహసీల్దార్‌కు ఫిర్యాదులు అందడంతో ఆదివారం ఈ ప్రాంతంలో దాడులు చేశామని చెప్పారు. రెవెన్యూ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా ఇసుక నిల్వలపై దాడులు చేయగా, మంగళపాలెంలో నకిలీ బిల్లులతో 18 టన్నుల ఇసుకు అక్రమంగా నిల్వచేసినట్టు గుర్తించామని, ఈమేరకు ఇసుకను సీజ్ చేసి రూ.25వేల జరీమానా విధించినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వై.లక్ష్మణనాయుడు చెప్పారు. దాడుల్లో ఆర్ఐ మంగరాజు, వీఆర్వో స్వరూప్ పాల్గొన్నారు.